క్లుప్తంగా

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి..



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో సింగరేణి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం (ఐఎన్‌టీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించగా జీఎం శాలేం రాజుతో పలు అంశాలపై నాయకులు చర్చించారు. స్పందించిన సీఎం త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రజాక్, మల్లికార్జున్‌రావు, గట్టయ్య, కత్తెర రాములుతో పాటు ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, డీజీఎం శివకేశవరావు, ఏజెంట్ రవీందర్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



షణ్ముక్ సాయిని అభినందిస్తున్న డీఎస్పీ

పాల్వంచ: ఇటీవల ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్వంచ ఏఐఎం లీడ్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న షణ్ముక్ సాయి ప్రథమ స్థానం సాధించాడు. ఈ మేరకు మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్ షణ్ముక్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ సతీష్, ఎస్‌ఐ డి.రాఘవయ్య, ప్రిన్సిపాల్ రెంటాల నాగభూషణం, ఏఓ మోహన్‌రావు, పీఈటీ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించుకుందాం..



మాట్లాడుతున్న హరిలాల్‌నాయక్

టేకులపల్లి: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించుకుందామని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్యా కిషోర్ సింగ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం టేకులపల్లిలో టీపీటీ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఐక్య సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గత ఆరు సంవత్సరాల కాలంలో అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయుల పక్షాన నిలబడి విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు.

వెల్ఫేర్ బోర్డు ఫలాలు పొందండి..



మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్ శాస్త్రి

ఇల్లెందు: పట్టణంలోని బిల్డింగ్ వర్కర్స్ అడ్డా మీద సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. హాజరైన లేబర్ ఆఫీసర్ శాస్త్రి మాట్లాడుతూ.. కార్మికులు వెల్ఫేర్ బోర్డు ఫలాలు పొందాలని, బోర్డు ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ కార్మికుడు వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్డు పొందాలని, మేస్త్రీలు కార్డులు లేని కార్మికులను పనిలోకి తీసుకుంటే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే వారే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. నబీ, కృష్ణ, మోహన్‌రావు, కామనాగరాజు పాల్గొన్నారు.

డైరీల ఆవిష్కరణ

ఇల్లెందురూరల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల సంఘం డైరీలను ఎంపీడీఓ ధన్‌సింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్, అజహర్, కృష్ణచైతన్య, కిరణ్, శివ పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు: సింగరేణి సీఎండీ పదవీకాలం మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు సీఎండీ బలరాంను మంగళవారం ఏఐటీయూసీ కేంద్ర ప్రతినిధి బృందం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్, కె.సారయ్య, వీరభద్రయ్య, వైవీ రావు, సమ్మయ్య సీఎండీకి కార్మికుల సమస్యలు వివరించారు. త్వరలో స్ట్రక్చరల్ మీటింగ్‌లో కార్మికుల సమస్యలు ప్రస్తావిస్తామని ప్రకటించారు.

అభివృద్ధికి ఆమడదూరం..

- మూడు పంచాయతీలలో అటవీ భూములతో ఇబ్బందులు
- రెవెన్యూ భూమిగా మార్చాలని స్థానికుల డిమాండ్
- మున్సిపాలిటీలో విలీనంపైనా వినతులు

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద పరిశ్రమ సింగరేణికి జన్మనిచ్చిన ప్రదేశంగా ఇల్లెందుకు చరిత్ర పుటల్లో చెరగని ముద్ర. నాటి నుంచి నేటికీ బొగ్గు తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. అత్యధిక స్థలం సింగరేణి లీజు పరిధిలో ఉండటం, మిగతా ప్రాంతంలోనూ అత్యధిక భూభాగం అటవీశాఖ పరిధిలో ఉండడం వంటి కారణాలతో పట్టణం, ఆనుకొని ఉన్న గ్రామ పంచాయతీల విస్తరణ, అభివృద్ధి ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కు అన్న చందంగా ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు అటవీ భూమిని రెవెన్యూలోకి మార్చడం లేదా సరిహద్దులో ఉన్న గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయడం.. ఏదో ఒక పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఇల్లెందురూరల్: పరిపాలన సౌలభ్యం కోసం ఆరేళ్ల క్రితం సుదిమళ్ల పంచాయతీ పరిధిలో ఉన్న సుభాష్‌నగర్, ఇందిరానగర్, బాలాజీనగర్‌లను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఇందిరానగర్, బాలాజీనగర్ మొత్తంగా అటవీశాఖ సర్వే నంబర్ 603 పరిధిలో, సుభాష్‌నగర్‌లో కూడా అత్యధిక భాగం సర్వే నంబర్ 603లో.. మిగతాది సుమారుగా 30శాతం వరకు రెవెన్యూ పరిధిలో ఉన్న భూములు ఉన్నాయి.

విస్తరణ, ఇళ్ల నిర్మాణానికి సమస్యలు...

అటవీ భూమి పరిధిలో ఉండటం వల్ల ఇందిరానగర్, బాలాజీనగర్, సుభాష్‌నగర్ పంచాయతీలలో ఇళ్ల, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు.. ప్రతీ విషయంలోనూ సమస్యలే వస్తున్నాయి. వాటికి అనుమతి పొందడం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి రావడమే అసలు సమస్యగా అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ప్రస్తుతం ఆయా గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్లకు గ్రామపంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేకపోగా కనీసం విద్యుత్ అనుమతి కూడా సమస్యగా మారింది. ఎలాగూ అనుమతి ఇవ్వలేదన్న సాకుతో పంచాయతీ అధికారులు లు ఇంటి పన్ను కూడా వసూలు చేయడం లేదు. దీంతో భూభాగం విస్తారంగా ఉన్నప్పటికీ అటు పట్టణం, ఇటు సరిహద్దున ఉన్న గ్రామపంచాయతీలు విస్తరణకు నోచుకోవడం లేదు.

జాయింట్ సర్వేతోనే స్పష్టత..

మూడు గ్రామపంచాయతీలలో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 603 మొత్తంగా అటవీశాఖ పరిధిలోదని అధికారులు రికార్డు ఆధారంగా చెబుతున్నారు. కానీ ఆయా ప్రాంతాలలో రెవెన్యూ అధికారులు ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేస్తున్నారు. ఇదే న్యాయం అయితే అటవీ భూములలో ఎల్‌టీఆర్ కేసులు ఎలా నమోదు చేస్తున్నారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దీనికోసం రెండు శాఖల అధికారులు జాయింట్ సర్వే చేయాలని కోరుతున్నారు.

రెవెన్యూలోకి మార్చాలని ఉద్యమం...

మూడు గ్రామపంచాయతీలలో విస్తరించి ఉన్న భూభాగంలో ప్రస్తుతం ఒక ఇంచు స్థలం కూడా ఖాళీగా లేదు. నూతన ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ సంబంధిత భవనాల నిర్మాణం కోసం అటవీశాఖ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంప్ షెడ్లు తదితరాలన్నీ అలా నిర్మించినవే. ప్రస్తుతం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుండటం ఆయా పంచాయతీలలో ఖాళీ స్థలం లేదని అధికారులు చెప్పడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని గుర్తించిన రాజకీయ పక్షాలు సర్వే నంబర్ 603ను రెవెన్యూ పరిధిలోకి మార్చాలని, తద్వారా గ్రామాలకు ఆనుకొని ఉన్న భూభాగంలో నూతన ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని సంతకాల సేకరణతో ఉద్యమం ప్రారంభించారు.



పట్టణానికి ఆనుకుని ఉన్న బాలాజీనగర్, ఇందిరానగర్ గ్రామపంచాయతీల వ్యూ

ఇల్లెందు సరిహద్దు గ్రామపంచాయతీలు

గ్రామం	జనాభా	సర్వే నంబరు	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఇందిరానగర్	2,769	603	240.15
బాలాజీనగర్	3,044	603	230.23
సుభాష్‌నగర్	4,718	603, 578, 617, 618	622.37

విలీనంపైనా డిమాండ్లు..

ఇందిరానగర్, బాలాజీనగర్, సుభాష్‌నగర్, సీఎస్పీ బస్తీ, విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే మున్సిపాలిటీ గ్రేడ్ పెరగడంతోపాటు పట్టణ విస్తరణ, ఉపాధి వనరులు, ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఐదేళ్ల క్రితం సత్యనారాయణపురం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేసినప్పుడు ఇదే విషయమై డిమాండ్లు వచ్చినా అటవీ సర్వే నంబర్లు, సింగరేణి లీజు భూమి అవరోధంగా నిలిచాయి. రెవెన్యూ పరిధిలోకి భూ బదలాయింపు చేస్తే మార్గం సుగమం అవుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూలో చేర్చే వరకు ఉద్యమం..



మూడు గ్రామపంచాయతీలలో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 603ను రెవెన్యూ సర్వే నంబర్‌గా మార్చే వరకు ఉద్యమిస్తాం. ఇప్పటికే సంతకాల సేకరణ ప్రారంభించాం. స్థానికుల అభిప్రాయాన్ని గౌరవించి వారికి మేలు జరిగేలా ప్రభుత్వం తక్షణం స్పందించి న్యాయం చేయాలి.

– ఆలేటి కిరణ్, కార్యదర్శి, సీపీఎం మండల శాఖ

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..



ఇందరానగర్, బాలాజీనగర్, సుభాష్‌నగర్‌లలో ఉన్న అటవీ భూమిని రెవెన్యూ పరిధిలోకి చేర్చడం, మున్సిపాలిటీలో విలీనానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కారమైతే ప్రజలకు కలిగే మేలును నివేదిక రూపంలో అందజేస్తాం.

– పులి సైదులు, అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల శాఖ

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి



మాట్లాడుతున్న సురేంద్ర

జూలూరుపాడు: ఖమ్మం నవీన ఆస్పత్రి డాక్టర్ బి.హరికుమార్, పాపకొల్లుకు చెందిన పాపిన్ని జనార్దర్ ఆర్థిక సహకారంతో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జూలూరుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం, కాకర్ల హైస్కూల్స్, పడమటనర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర స్థాయి వ్యక్తిత్వ వికాస నిపుణులు సురేంద్ర, సుధీర్, నవీన్, ఖాసీం, వరుణ్ శిక్షణ ఇచ్చారు.

పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని తొలగించి, ఒత్తిడిని అధిగమించి మంచి మార్కులు ఏలా సాధించాలో వివరించారు. పాపకొల్లు హైస్కూల్‌లో దాతలు కొదుమూరి కోటేశ్వరరావు, ధర్మరాజుల వెంకటనారాయణల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం కమిటీ ఎన్నిక

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో మంగళవారం మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం (ఏఐటీయూసీ) మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జూలూరుపాడుకు చెందిన ముదిగొండ లక్ష్మీ, కార్యదర్శిగా గుండెపుడి గ్రామానికి చెందిన బత్తుల ఇందిర మరో 15 మందిని కౌన్సిల్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



ముదిగొండ లక్ష్మీ



బత్తుల ఇందిర

స్థానిక ఎన్నికల నిర్వహణకు సహకరించండి..

ఇల్లెందురూరల్: ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశించినా స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, రాజకీయ పక్షాలు సహకరించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఓటరు జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. ఇప్పటికే పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేసి నోటీసు బోర్డులలో ప్రదర్శించామని, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అఖిలపక్ష పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరామ్, నాయకులు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, రోకటి నరసింహారావు, తంబర్ల నరసింహారావు, గార్లపాటి సైదులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

ఇల్లెందు: అసెంబ్లీని ముట్టడిస్తున్నారని అందిన సమాచారం ఆధారంగా జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. మంగళవారం ఇల్లెందులో బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్, సీనియర్ సభ్యులు సిలివేరు సత్యనారాయణ, కౌన్సిలర్ జేకే శ్రీనివాస్, అబ్దుల్ నబీలను ఎస్‌ఐ సూర్య అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గమని దిండిగల రాజేందర్, సిలివేరు సత్యనారాయణలు తీవ్రంగా ఖండించారు.

కొత్తగూడెంటౌన్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలకు రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టులు చేశారు.



పోలీసు స్టేషన్‌లో అరెస్టు అయిన నాయకులు

అరెస్ట్‌లను ఖండించిన మాజీ మంత్రి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుంటే అరెస్ట్‌లు చేయడం సమంజసం కాదన్నారు.

20న హైదరాబాద్‌కు తరలిరండి..



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను విస్మరించారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారీ ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాడు కేసీఆర్ నడిచిన దారిలోనే రేవంత్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. తమ ఎన్నికల ప్రణాళికలో ఏడో గ్యారెంటీగా హామీ ఇచ్చిన పౌరహక్కులను అమలు చేయటం లేదని పేర్కొన్నారు. కేంద్రం ప్రభుత్వం ఆదివాసులపై అప్రకటిత యుద్ధం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో ముక్తి సత్యం, జే.సీతారామయ్య, కే.సారంగపాణి, తుపాకుల నాగేశ్వరరావు, ఉమర్, మోకాళ్ల రమేష్, ఎండీ రాసుద్దీన్, నరసింహారావు, నెమిళ్ల సంజీవ్, గౌని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు

సింగరేణి(కొత్తగూడెం): టీయూసీఐ జిల్లా మహాసభ విజయవంతానికి ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసినట్లు సంఘం కోశాధికారి పి.సతీష్ తెలిపారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యాయలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గౌరవాధ్యక్షుడిగా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, అధ్యక్షుడిగా సీఎంఓఏఐ (సింగరేణి) మాజీ అధ్యక్షుడు గడిపెల్లి కృష్ణ ప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా గోపాలరావు, గౌరవ సలహాదారులుగా కెచ్చెర్ల రంగయ్యలను ఎన్నుకున్నామని వీరి సారథ్యంలో ఫిబ్రవరి 16న జరుగనున్న టీయూసీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాకూబ్‌షావలీ, గోనెల రమేష్, అమర్లపూడి రాము, బానోత్ ధర్మ, పిల్లి ఆనంద్, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

నులిపురుగుల నివారణపై సమీక్ష

టేకులపల్లి: ఈనెల 10న 0 – 19 సంవత్సరాల వయస్సులోపు పిల్లలందరికీ నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు మింగించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్‌లో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే వేసవికాలంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉదయం సాయంత్రం వేళల్లోనే పనులు చేసుకోవాలని, తెలుపు, కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ఓఆర్‌ఎస్ లేదా పల్చటి మజ్జిగ తరచు తీసుకోవాలన్నారు. ఆల్కహాల్, పొగాకు ఉత్పత్తులు, కూల్ డ్రింక్స్, బహిరంగ ప్రదేశాలలో అమ్మే తీయని పానియాలు తీసుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్లు గుజ్జా విజయ, కౌశల్య సింగ్, పోరండ్ల శ్రీనివాస్, నాగబండి వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి దినేష్

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ జానీపాషా, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యరాజు, కొమరయ్య విమర్శించారు. మంగళవారం రామవరం బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి జీఎస్టీ, బొగ్గు రూపంలో 70 శాతం ఆదాయం తెలంగాణ రాష్ట్రం నుంచే వస్తోందన్నారు. అలాంటి తెలంగాణకు బడ్జెట్‌లో అన్యాయం చేయడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి నాగేశ్వరరావు, గెద్దె బాబూరావు, పెద్దిరెడ్డి శ్రీను, కోమరయ్య, శ్రీనివాసరావు, బానోతు రాజ్‌కుమార్, నాగరాజు, మూడు రమేష్, పాషా, డేవిడ్‌రాజు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మిరపకు గిట్టుబాటు ధర కల్పించండి..

జూలూరుపాడు: మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాపకొల్లులో జరిగిన రైతు సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చికి క్వింటాకు రూ.25 వేలు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. రెండేళ్లుగా చీడపీడలు, తెగుళ్లతో మిర్చి దెబ్బతినడంతో రైతులను కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. కొద్దోగొప్పో పండిన మిర్చి పంటకు రోజురోజుకు ధర పతనం అవుతుండటంతో రైతులకు దిక్కు తోచడం లేదన్నారు. మిర్చికి ప్రారంభంలో రూ.21 వేలు ఉండగా ప్రస్తుతం రూ.14 వేలకు పడిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఒకవైపు పెరిగిన పెట్టుబడులతో అప్పుల ఊబిలో పడ్డారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యాసా రోశయ్య, ఊడల సుధాకర్, అప్పికట్ల శ్రీనివాసరావు, కొట్టె నరసింహారావు, బ్రహ్మారావు, అప్పికట్ల సతీష్, వేణు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

కేన్సర్, క్షయ వ్యాధులపై అవగాహన ఉండాలి



సింగరేణి(కొత్తగూడెం): అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లలిత



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య

సింగరేణి(కొత్తగూడెం): ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తగూడెం ఏరియాని జీఎం కార్యాలయంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హెల్త్ ఆఫీసర్ లలిత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎం ఎం.శాలేం రాజు మాట్లాడుతూ.. కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించినట్లైతే వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ... కేన్సర్‌పై అవగాహన పెంచడం ద్వారా కేన్సర్‌తో బాధపడేవారికి మద్దతు ఇవ్వటానికి ఉపకరిస్తుందన్నారు. ప్రధానంగా గుట్కా, చుట్ట, బీడి, జర్దా, మద్యం, పొగాకుకు దూరం ఉండాలని, వేడి పదార్థాలను తీసుకోవాలని, మాడిన, నూనె వస్తువులను తీసుకోవద్దని సూచించారు.

పాల్వంచ: కేన్సర్ వ్యాధి పట్ల విద్యార్థులు చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలని పాల్వంచ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజిత్ ముషారఫ్ అన్నారు. పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ బాలికల కళాశాలలో మంగళవారం కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. కేన్సర్ లక్షణాలను, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌పై సూచనలు చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.జ్వలిత, హెల్త్ సూపర్‌వైజ్ డాక్టర్ కె.దైవవీనస్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ బి.హిమబిందు, జె.శ్రీలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: క్షయ వ్యాధి నివారణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారులు గోపీలాల్, మహమ్మద్ సుమయ, ఇల్లెందు టీబీ యూనిట్ అధికారి శంకర్ అన్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నిక్షయ్ షివిర్ కార్యక్రమం మంగళవారం గోలియాతండ, టేకులపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మాట్లాడుతూ... క్షయ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందన్నారు. 15 రోజుల మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం లాంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించి ఉచితంగా చేసే అత్యంత నాణ్యమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిర్ధారణ జరిగితే ఖరీదైన మందులు ఉచితంగా ఇవ్వడంతోపాటు, నెలకు వెయ్యి రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. సూపర్‌వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శరత్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రతీఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, రాజు, ప్రభాకర్‌రావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నాగేశ్వరరావు, పి.కృష్ణవేణి, డాక్టర్ రాకేష్‌శ్రీరాం, జి.శేఖర్, సరిత, సురేందర్, ఈశ్వర్, డాక్టర్ రాజు పాల్గొన్నారు.